WWW.TELUGUJYOTHIDAILY.COM
www.epaperteluguJyothidaily.com
PRGI NO TGTEL/25/A2223

TJ99 అనుక్షణం జనం కోసం NEWS

# తెలుగు జ్యోతి

జాతీయ దిన పత్రిక
అనుక్షణం జనం కోసం

విలేఖర్లు కావలెను



తెలుగు రాష్ట్రాల్లో అన్ని జిల్లాలు నియోజకవర్గాలు మండలాల వారీగా "తెలుగుజ్యోతి" జాతీయ దినపత్రిక కు రిపోర్టర్లు కావలెను
ఎటువంటి యాడ్ టార్గెట్లు లేవు,
క్యాలెండర్ టార్గెట్లు లేవు,
9700959506
www.telugujyothinews. com

PUBLISHED FROM : HYDERABAD, CIRCULATED TO HYDERABAD, WARANGAL,NALGONDA, KHAMMAM,RANGAREDDY, KARIMNAGAR, AMARAVATI,KADAPA

సంపుటి:01 సంచిక:309 ఎడిటర్ : దువ్వల శేఖర్ యాదవ్ పేజీలు:04 తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ ఆదివారం 29-03-2026 వెల రూ.4.00

## హర్ముజ్ జలసంధి దాటిన
# భారత ఎల్పీజీ నౌకలు

బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్‌లు హర్ముజ్ దాటినట్లు వెల్లడి

అంతర్జాతీయ జలాల్లోకి రెండు నౌకలు ప్రవేశించాయన్న భారత వర్గాలు

90,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ గ్యాస్ రాక

2



## మంత్రి సంస్థపై
# చర్యలు ఎందుకు లేవు

మంత్రి పొంగులేటి కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై హరీశ్ రావు సంచలన ఆరోపణలు

ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ స్టోన్ క్రషర్ నడుపుతున్నారన్న హరీశ్

మంత్రి సంస్థపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్న

పొంగులేటి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్

2



# 'తొలి ముద్ద'

## అంగన్ వాడీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్



2

తెలుగు జ్యోతి,హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలోని అంగన్ వాడీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్ 'తొలి ముద్ద'ను ప్రభుత్వం ప్రారంభించింది. అసెంబ్లీ కమిటీ హాల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ స్కీమ్‌లో భాగంగా అంగన్ వాడీ చిన్నారులకు రెడీ టూ కుక్ ఫుడ్ (ఉప్మా, కిచిడీ మిక్స్)ను బ్రేక్ ఫాస్ట్‌గా ప్రభుత్వం అందించనుంది. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ వర్కర్స్‌కు మొబైల్ ఫోన్‌లను రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు. మంత్రులు సీతక్క, కొండా సురేఖ, ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఫహీం, చైల్డ్ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ సీతా దయాకర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అంగన్ వాడీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను ప్రారంభించిన సీఎం

రెడీ టూ కుక్ ఫుడ్ (ఉప్మా, కిచిడీ మిక్స్)ను బ్రేక్ ఫాస్ట్‌గా అందించనున్న ప్రభుత్వం

అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు పంపిణీ

# మూసీ ఒడ్డున ఎందుకు?

మూసీ ఒడ్డున భారీ హోటళ్లు,బిజినెస్ సెంటర్ల నిర్మాణం ఎందుకు? : కేటీఆర్ నిలదీత

లక్షలాది ఇళ్లను కూల్చివేసి, 3 వేల ఎకరాల భూమిని సేకరించాలనుకుంటున్నారని ఆరోపణ

కార్పొరేట్ కంపెనీలకు ఆ భూమిని అప్పగించే ప్రయత్నం జరుగుతోందన్న కేటీఆర్

అవినీతి గురించి ప్రశ్నిస్తే ముఖ్యమంత్రి బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం

2



తెలుగు జ్యోతి,హైదరాబాద్

మూసీ ఒడ్డున ఉన్న ఇళ్లు చట్టవిరుద్ధమని చెప్పే ప్రభుత్వం, అదే ప్రాంతంలో భారీ హోటళు ,, బిజినెస్ సెంటర్లు నిర్మించాలనుకోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. మూసీ ప్రాజెక్టు పేరుతో లక్షలాది ఇళ్లను

## ప్రతి దేశం ఇప్పుడు
# సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది

ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై యుద్ధం ప్రభావం పడిందన్న ప్రధాని

ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని వెల్లడి

ఇంతటి సంక్షోభం సమయంలోనూ అభివృద్ధి కొనసాగుతోందని ఉద్ఘాటన

తెలుగు జ్యోతి,డెస్క్

పశ్చిమాసియాలోని ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచంలోని ప్రతి దేశం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ప్రతి దేశం తీవ్రంగా ప్రయత్నిస్తోందని తెలిపారు. అక్కడ గత నెల

2



## అమరావతిని
# అంగుళం కూడా కదిలించలేరు

అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం

గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని నాశనం చేసిందని చంద్రబాబు విమర్శ

2028 నాటికి రాజధానిలోని కీలక నిర్మాణాలు పూర్తి చేస్తామని వెల్లడి

అమరావతిలో విధ్వంసానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

ఒకే రాజధాని, మూడు ప్రాంతాల అభివృద్ధి తమ ప్రభుత్వ విధానమని స్పష్టీకరణ

2



తెలుగు జ్యోతి,డెస్క్

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధాని అమరావతేనని, దీనిని ఎవరూ తాకలేరని, అంగుళం కూడా కదిలించలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. అమరావతికి సంపూర్ణ చట్టబద్ధత కల్పించడం ద్వారా భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలనే లక్ష్యంతో, శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి

## అక్రమ మైనింగ్‌లపై సభలో దుమారం

సీబీసీఐడీ విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్‌రెడ్డి

2

# ఇసుక మాఫియాను నడిపారు

హరీశ్ రావు సోదరుడిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు

మహేశ్వర్ రావు ఇసుక మాఫియాను నడిపారన్న ముఖ్యమంత్రి

మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటన

సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణకు ఆదేశిస్తున్నట్లు వెల్లడి

2



# ఉగ్రభూమిగా పాకిస్థాన్..
## గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్‌లో అగ్రస్థానం

ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం తగ్గుముఖం పడుతుంటే పాక్‌లో మాత్రం పెరుగుదల

2025లో 1,139 మరణాలు, 1,045 దాడులతో పాక్ కు అత్యంత హింసాత్మక ఏడాది

దశాబ్దాల తరబడి విధాన వైఫల్యాలే ప్రస్తుత దుస్థితికి కారణమని నివేదిక వెల్లడి

ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్‌లలోనే అత్యధికంగా ఉగ్రదాడులు

2



ALL ARE CONTINUE 2 PAGE

## ఇసుక మాఫియాను నడిపారు

మొదటి పేజీరువాయి

మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు సోదరుడిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు తమ్ముడు మహేశ్వర్ రావు ఇసుక మాఫియా నడిపారని శాసనసభలో ఆరోపించారు. అతడి అక్రమాల వల్లే కేటీఆర్ మైనింగ్ శాఖను తీసుకున్నారని అన్నారు. శాసనసభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మైనింగ్, ఇసుక తవ్వకాలపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు.సిరిసిల్ల, నేరెళ్ల ఇసుక మాఫియాపై విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి అన్నారు. మాజీ ఎంపీ సంతోష్ రావు, ఆయన తండ్రి రవీందర్ రావులపై విచారణ జరపడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నాయకుడు గంగుల కమలాకర్ అక్రమ గ్రానైట్ మైనింగ్, వద్దిరాజు రవిచంద్ర కంపెనీ అక్రమ మైనింగ్‌పై విచారణకు సిద్ధమని తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్‌తో పాటు అన్నింటిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు.విచారణలో నిజానిజాలు నిగ్గుతేల్చి శాసనసభలో నివేదికను పెడతామని అన్నారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ నాయకులు ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారని మండిపడ్డారు. వద్దిరాజు రవిచంద్ర వంటి వారిని బీఆర్ఎస్ నాయకులు బెదిరించి తమకు అనుకూలంగా మార్చుకున్నారని ఆరోపించారు.

## ప్రతి దేశం ఇప్పుడు సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది

మొదటి పేజీరువాయి

రోజులుగా భీకర పోరు కొనసాగుతోందని అన్నారు. ఈ యుద్ధం కారణంగా ఆహారం, ఇంధనం, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో దేశాల్లో నిత్యావసర వస్తువుల కొరత ఏర్పడిందని అన్నారు.ప్రపంచమంతా ఎదుర్కొంటున్న ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని అన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల నుంచి మన దేశాన్ని రక్షించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. రైతులు, ప్రజలపై ఈ యుద్ధం భారం పడకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇంతటి సంక్షోభ సమయంలో మన దేశంలో అభివృద్ధి కొనసాగుతోందని అన్నారు.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అందరూ ఐక్యంగా ఉండాలని, ప్రశాంతతను పాటించాలని ప్రధాని మోదీ కోరారు. ప్రస్తుత సంక్షోభ సమయంలో విపక్షాలు ప్రజలను గందరగోళానికి గురిచేయవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం విధానాలు దేశం, ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా ఉంటాయని అన్నారు.నోయిడాలోని జేవార్ ప్రాంతంలో పీపీపీ పద్ధతిలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్టు మొదటి దశను ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. రూ.11,200 కోట్లతో దీనిని నిర్మిస్తున్నారు. ఆధునాతన నావిగేషన్ సిస్టమ్స్ సహాయంతో 3,900 మీటర్ల పొడవైన ఈ విమానాశ్రయం రన్‌వేపై అతిపెద్ద విమానాలు కూడా రాకపోకలు సాగించే వీలుంది. సరకు రవాణా కోసం కార్గో లాజిస్టిక్ జోన్లను అనుసంధానం చేస్తూ మల్టీమోడల్ కార్గో హబ్‌నూ నిర్మించారు.

### హర్మూజ్ జలసంధి దాటిన

## భారత ఎల్పీజీ నౌకలు

మొదటి పేజీరువాయి

భారతీయ జెండాలు కలిగిన రెండు ఎల్పీజీ కంటైనర్లు బీడబ్ల్యూ ఈఎల్ఎం, బీడబ్ల్యూ టీవైఆర్‌లు హర్మూజ్ జలసంధిని దాటాయి. శుక్రవారం నాడు దుబాయ్ రస్‌అల్‌ఖైమాకు ఉత్తరాన లంగర్ వేసిన ఐదు నౌకలలో ఇవి కూడా ఉన్నాయి. ఈఎల్ఎం నౌక హెచ్‌పీసీఎల్‌ది కాగా, టీవైఆర్ నౌక బీపీసీఎల్‌కు చెందినది. భారత్ సహా మిత్రులైన ఐదు దేశాల నౌకల కోసం హర్మూజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన విషయం తెలిసిందే.ఎల్పీజీని తీసుకువస్తున్న రెండు నౌకలు సురక్షితంగా హర్మూజ్‌ను దాటినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ రెండు నౌకల్లో 90,000 మెట్రిక్ టన్నులకు పైగా ఎల్పీజీ గ్యాస్ వస్తోంది. ఈ రెండు నౌకలు హర్మూజ్‌ను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మరికొన్ని భారతీయ ట్యాంకర్లు యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్ సమీపంలోని జలాల్లో ఇరాన్ అనుమతి కోసం వేచి చూస్తున్నాయి. కాగా, 47,000 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ గ్యాస్‌తో కూడిన జగ్ వసంత్ ట్యాంకర్ నౌక గుజరాత్‌లోని వదినార్ పోర్టుకు చేరుకుంది.

### అంగన్ వాడీ పిల్లలకు

## బ్రేక్ ఫాస్ట్ స్కీమ్

మొదటి పేజీరువాయి

న్యూట్రిషన్ ఫుడ్ అందడం లేదు

ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం, ఈ పథకం ప్రారంభోత్సవానికి ఒక మంచి నేపథ్యం ఉందని గుర్తు చేశారు. గతంలో దేశంలో నిరక్షరాస్యతను తగ్గించేందుకు, వ్యవసాయ అభివృద్ధికి తొలి ప్రధాని ఎడ్యుకేషన్, ఇరిగేషన్ కు ప్రాధాన్యత ఇచ్చారని, దేశంలో ప్రస్తుతం ఫుడ్ సెక్యూరిటీ ఉందని, కానీ న్యూట్రిషన్ ఫుడ్ అందడం లేదని తెలిపారు. అందుకే ప్రభుత్వం బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుంచే తల్లికి పౌష్టిక ఆహారం అందిస్తోందని అన్నారు. ఇప్పుడు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా ప్రారంభించామని పేర్కొన్నారు.

ముందుగా మీ సమస్యలనే పరిష్కరిస్తాం

ప్రభుత్వం ఎంత మంచి ప్రణాళికలు చేసినా, అమలు చేయాల్సింది అంగన్‌వాడీ టీచర్లు మాత్రమేనని, అందుకే ప్రభుత్వం వారిపై గురుతర బాధ్యత పెట్టిందని స్పష్టం చేశారు. అంగన్ వాడీ చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకుని, వారికి పౌష్టికాహారం అందించాలని కోరారు. అంగన్ వాడీ సిబ్బందిని ప్రభుత్వం కుటుంబ సభ్యుల్లా భావిస్తోందన్న ఆయన, ఆ శాఖ సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చిస్తున్నామని, ఏ మాత్రం ఆర్థిక వెసులుబాటు కలిగినా ముందుగా వారి సమస్యలనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదు

ఈ క్రమంలోనే అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో ఉండటానికి వీల్లేదని, సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. ఆరేళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం అందితేనే వారిలో మానసిక ఎదుగుదల ఉంటుందని, పౌష్టికాహారం లేకపోవడం వల్లే ఎక్కువ సమస్యలు వస్తున్నాయని తెలిపారు. భవిష్యత్‌లో అవే అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయని అన్నారు. అలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టిందని వివరించారు.

### మంత్రి సంస్థపై

## చర్యలు ఎందుకు లేవు

మొదటి పేజీరువాయి

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన 'రాఘవ కన్‌స్ట్రక్షన్స్' శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడలో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా భారీ స్టోన్ క్రషర్‌ను నడుపుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అసెంబ్లీ సాక్షిగా ధ్వజమెత్తారు. సర్వే నంబర్ 62, 63లలో జరుగుతున్న ఈ అక్రమ మైనింగ్ వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోందని ఆయన ఆరోపించారు. మైనింగ్ శాఖ నోటీసులు ఇచ్చినా, లేఖలు రాసినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన నిలదీశారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడి అరెస్టును ప్రస్తావిస్తూ హరీశ్ రావు ప్రభుత్వ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. చిన్న తప్పు చేశారనే నెపంతో మహిపాల్ రెడ్డి తమ్ముడిని రాత్రికి రాత్రే అరెస్ట్ చేసి నెల రోజులు జైల్లో పెట్టారని, మరి అంతకంటే పెద్ద అక్రమాలకు పాల్పడుతున్న మంత్రి సంస్థపై చర్యలు ఎందుకు లేవని ప్రశ్నించారు. "అధికార పక్షానికి ఒక న్యాయం, ప్రతిపక్షానికి మరో న్యాయమా?" అని మండిపడ్డారు.తన ట్వీట్లపై మంత్రి పొంగులేటి 'మొరిగే కుక్కలు' అంటూ చేసిన వ్యాఖ్యలను హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. అక్కడ కాంగ్రెస్ జెండాలు ఉన్న ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, అది కచ్చితంగా పొంగులేటి సంస్థేనని స్పష్టం చేశారు. ఆయన మంత్రి పదవిలో ఉంటే విచారణ నిష్పక్షపాతంగా జరగదని, అందుకే వెంటనే రాజీనామా చేసి విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా హరీశ్ రావు ప్రభుత్వానికి ఒక అల్టిమేటం జారీ చేశారు. "నేను చెప్పేవి అబద్ధాలైతే నన్ను ఉరి తీయండి లేదా ఎమ్మెల్యే పదవి నుంచి సస్పెండ్ చేయండి. ఒకవేళ నేను చెప్పేవి నిజాలైతే మాత్రం వెంటనే రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి" అని సంచలన ప్రకటన చేశారు. ఈ సవాల్‌తో అసెంబ్లీలో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది.

## అమరావతిని అంగుళం కూడా కదిలించలేరు

మొదటి పేజీరువాయి

పంపారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ.. అమరావతిపై గత ప్రభుత్వం చేసిన విధ్వంసాన్ని, ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యాలను సుదీర్ఘంగా వివరించారు.

చారిత్రక నేపథ్యం.. తెలుగుజాతి ఆత్మగౌరవం

అమరావతికి వందల ఏళ్ల చరిత్ర ఉందని, శాతవాహనులు ఇక్కడి నుంచే పాలన సాగించారని చంద్రబాబు గుర్తు చేశారు. బ్రిటిష్ మ్యూజియంలో సైతం అమరావతి గ్యాలరీ ఉండటమే దీని ప్రాశస్త్యానికి నిదర్శనమని అన్నారు. పొట్టి శ్రీరాములు త్యాగంతో ఏర్పడిన ఆంధ్రరాష్ట్రానికి అప్పుడే విజయవాడను రాజధాని చేసి ఉంటే పరిస్థితి మరోలా ఉండేదని అభిప్రాయపడ్డారు.ఒకప్పుడు తెలుగువారిని 'మదరాసీలు' అని పిలిచేవారని, ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని తెలిపారు. పీవీ నరసింహారావు తెచ్చిన ఆర్థిక సంస్కరణలను అందిపుచ్చుకుని తెలుగువారు ప్రపంచవ్యాప్తంగా రాణించారని, తాను సైబరాబాద్ నిర్మించడం వల్లే నేడు తెలంగాణ ఆదాయంలో హైదరాబాద్ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు.

మూడు రాజధానుల కుట్ర.. జగన్‌పై చంద్రబాబు ఫైర్

ఎన్నికలకు ముందు అమరావతికి జై కొట్టిన జగన్ మోహన్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక మాట మార్చి మూడు రాజధానుల నాటకానికి తెరలేపారని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. 'ఒక్క ఛాన్స్' పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లారని ఆరోపించారు. ప్రజావేదిక కూల్చివేతతో విధ్వంస పాలన మొదలుపెట్టారని, అమరావతిని శ్మశానం, ఎడారి, ముంపు ప్రాంతం, వేశ్యల రాజధాని అంటూ దుష్ప్రచారం చేసి ప్రజల్లో విషం నింపారని మండిపడ్డారు. మూడు రాజధానుల బిల్లును శాసన మండలి తిరస్కరించి సెలెక్ట్ కమిటీకి పంపితే, నిబంధనలకు విరుద్ధంగా గవర్నర్‌కు పంపి చట్టం చేయాలని చూశారని, కానీ హైకోర్టు జోక్యంతో రాజధానిని కాపాడుకోవాల్సి వచ్చిందని గుర్తు చేశారు.

రైతుల త్యాగం.. 1631 రోజుల పోరాటం

రాజధాని కోసం రైతులు స్వచ్ఛందంగా 33 వేల ఎకరాల భూమిని శాంతియుతంగా ప్రభుత్వానికి ఇచ్చారని, ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి ల్యాండ్ పూలింగ్ జరగలేదని చంద్రబాబు అన్నారు. అలాంటి రైతులపై గత ప్రభుత్వం ఉక్కుపాదం మోపిందని, అక్రమ కేసులు బనాయించి, మహిళలని కూడా చూడకుండా జుట్టు పట్టుకుని ఈడ్చి, కాళ్లతో తన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు 1,631 రోజుల పాటు చారిత్రాత్మక పోరాటం చేశారని, 'న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు' పాదయాత్రతో తమ ఆవేదనను తెలియజేశారని కొనియాడారు. వైసీపీ అమరావతికి, ఆంధ్రప్రదేశ్‌కు ద్రోహం చేసిందని, అందుకే ప్రజలు 151 సీట్ల నుంచి 11 సీట్లకు పరిమితం చేశారని వ్యాఖ్యానించారు.

2028 నాటికి అమరావతి పూర్తి.. పనుల పునఃప్రారంభం

ప్రజాతీర్పుతో రాష్ట్రానికి మళ్లీ మంచి రోజులు ప్రారంభమయ్యాయని చంద్రబాబు అన్నారు. అమరావతి పనులు ఇప్పటికే పునఃప్రారంభమయ్యాయని, దాదాపు రూ.56 వేల కోట్ల విలువైన 91 పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.2028 నాటికి అమరావతిలో ప్రధాన నిర్మాణాలు పూర్తి చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. ట్రంక్ రోడ్లు 2027 మే నాటికి, అసెంబ్లీ, హైకోర్టు, ఐకానిక్ టవర్లు 2028 ఆగస్టు నాటికి పూర్తి చేసి ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని వెల్లడించారు. శంకుస్థాపన చేసిన నగరంలో పనులు ఆగిపోయి, మళ్లీ పునఃప్రారంభించడం చరిత్రలో అమరావతిలోనే జరిగిందని అన్నారు.

## అక్రమ మైనింగ్‌లపై సభలో దుమారం

మొదటి పేజీరువాయి

మైనింగ్ అంశంపై శాసనసభ దద్దరిల్లింది. పద్దులపై చర్చలో భాగంగా గనుల అంశంపై హరీశ్‌రావు మాట్లాడుతూ మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. పొంగులేటిని ఉద్దేశిస్తూ హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మండిపడిన మంత్రులు పదేళ్ల అక్రమాలను ప్రస్తావించారు. బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లో బైఠాయించి నినాదాలు చేపట్టగా ఈ క్రమంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకున్నారు. 2014 జూన్ 2 నుంచి అక్రమ మైనింగ్‌పై సీబీసీఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు.

నిబంధనలు ఉల్లంఘించి మైనింగ్

పద్దులపై చర్చలో భాగంగా అసెంబ్లీలో మైనింగ్ అంశం తీవ్ర దుమారం రేపింది. బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అనుమతులు లేకుండా క్రషర్స్ నడుపుతోందని ఆరోపించారు. నిబంధనలు ఉల్లంఘించి మైనింగ్ చేపడుతున్నా ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. రక్షకులే భక్షకులయ్యారని ఆరోపించారు. ప్రభుత్వ ఖజానాకు తూట్లు పొడుస్తున్న అంశంపై సభాసంఘం వేయాలని డిమాండ్ చేశారు.

## గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్‌లో అగ్రస్థానం

మొదటి పేజీరువాయి

ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదం తగ్గుముఖం పడుతున్నప్పటికీ, పాకిస్థాన్ మాత్రం దానికి పూర్తి భిన్నమైన దిశలో పయనిస్తోంది. గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ (జీటీఐ) 2026 ప్రకారం, ఉగ్రవాదం వల్ల అత్యంత ఎక్కువగా ప్రభావితమైన దేశంగా పాకిస్థాన్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ నివేదికలోని గణాంకాలు పాకిస్థాన్ ఎదుర్కొంటున్న తీవ్రమైన అంతర్గత సవాళ్లను, దశాబ్దాలుగా అనుసరిస్తున్న విధానాల వైఫల్యాలను స్పష్టంగా ఎత్తిచూపుతున్నాయి.గ్రీక్ సిటీ టైమ్స్ తన కథనంలో వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ సూచీలో పాకిస్థాన్ ఉగ్రవాదానికి కేంద్ర బిందువుగా నిలిచింది. 2025 సంవత్సరంలోనే దేశంలో 1,045 ఉగ్రదాడులు జరిగాయని, వాటిలో 1,139 మంది ప్రాణాలు కోల్పోయారని నివేదిక వివరించింది. మరో 1,595 మంది గాయపడగా, 655 మందిని ఉగ్రవాదులు బందీలుగా పట్టుకున్నారు. ఇండెక్స్‌లో 8.574 స్కోరుతో పాకిస్థాన్ అన్ని దేశాల కంటే ముందుంది. 2013 తర్వాత పాకిస్థాన్‌కు ఇదే అత్యంత హింసాత్మక సంవత్సరమని నివేదిక పేర్కొంది. ప్రపంచమంతటా ఉగ్రవాదం తగ్గుతుంటే, పాక్‌లో ఈ స్థాయి పెరుగుదల ఆందోళన కలిగిస్తోంది.పాకిస్థాన్‌లో జరుగుతున్న హింస భౌగోళికంగా కొన్ని ప్రాంతాలకే పరిమితమైందని నివేదిక గుర్తించింది. ముఖ్యంగా ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రావిన్సులలోనే 2025లో మొత్తం దాడుల్లో 74 శాతం, మరణాల్లో 67 శాతం నమోదయ్యాయి. ఈ ప్రాంతాలు నిరంతర అస్థిరత, బలహీనమైన ప్రభుత్వ నియంత్రణతో ఉగ్ర కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయని నివేదిక తెలిపింది. ఆఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దు వెంబడి దశాబ్దాలుగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉదాసీన వైఖరే ఇందుకు కారణమని విశ్లేషించింది.పాకిస్థాన్‌లోని గిరిజన ప్రాంతాలు చాలా కాలంగా పాక్షిక పాలనలో ఉండటం వల్ల అల్-ఖైదా, హక్కానీ నెట్‌వర్క్, స్థానిక ఉగ్ర సంస్థలకు సురక్షిత స్వర్గధామంగా మారాయని నివేదిక వెల్లడించింది. డ్యూరాండ్ లైన్‌కు ఇరువైపులా ఉన్న జాతి, సామాజిక బంధాలు సరిహద్దులు దాటి ఉగ్రవాదుల కదలికలకు మరింత ఆస్కారం కల్పిస్తున్నాయని పేర్కొంది. దీనివల్ల నిఘా, నియంత్రణ సంక్లిష్టంగా మారాయి. ప్రభుత్వ పాలన బలహీనంగా ఉన్న చోట ఉగ్రవాద నెట్‌వర్క్‌లు ఎలా పనిచేస్తాయో ఈ పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయని నివేదిక నొక్కి చెప్పింది.గతంలో తీసుకున్న విధానపరమైన నిర్ణయాలు, నిర్మాణ లోపాల సంచిత ప్రభావమే పాకిస్థాన్ ప్రస్తుత దుస్థితికి కారణమని గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ తేల్చి చెప్పింది. కొన్ని ప్రాంతాలలో దాడులు కేంద్రీకృతం కావడం, నిర్దిష్ట గ్రూపుల ప్రాబల్యం పెరగడం వంటివి పాక్ వ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడిని సూచిస్తున్నాయి. ఈ సూచీలో పాకిస్థాన్ అగ్రస్థానానికి చేరడం అనేది ఒక సుదీర్ఘ ప్రయాణం యొక్క ఫలితమని, ఈ పరిస్థితికి దారితీసిన అంశాలు ఇప్పటికీ చురుకుగా ఉన్నాయని నివేదిక స్పష్టం చేసి

## మూసీ ఒడ్డున ఎందుకు?

మొదటి పేజీరువాయి

కూల్చివేయడానికి, దాదాపు 3 వేల ఎకరాల భూమిని సేకరించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి కుంభకోణాలు, అవినీతి గురించి ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ అక్రమాలను ప్రశ్నిస్తే ప్రతిపక్షాన్ని బెదిరించే ధోరణిలో మాట్లాడారని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి బెదిరింపులు అలవాటుగా మారాయని, కానీ ఆయన బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదని గుర్తుంచుకోవాలని అన్నారు.ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చారని, వాటిని అమలు చేయడానికి ఖజానాలో ఒక్క రూపాయి లేదని చెబుతున్న ముఖ్యమంత్రి, మూసీ ప్రాజెక్టు కోసం మాత్రం లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేస్తామని చెప్పడం విడ్డూరమని అన్నారు. మూసీ ప్రాజెక్టు పేరుతో అక్రమాలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. అధికార పార్టీ అవినీతిని ప్రశ్నిస్తే, శివతాండవం చేస్తానని ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరమని అన్నారు. ముఖ్యమంత్రి అహంకారపూరితంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నగరాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు.

# సంగారెడ్డి రామ్ మందిర్ లో శ్రీరామనవమి వేడుకలు సంగారెడ్డి మాజీ శాసనసభ్యులు తూర్పు జయప్రకాశ్ రెడ్డి ఘనంగా నిర్వహించారు



**27 మార్చి తెలుగు జ్యోతి దినపత్రిక సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్.**
సంగారెడ్డి జిల్లా. సంగారెడ్డి పట్టణంలో రామ్ మందిర్ లో రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు సంగారెడ్డి మాజీ శాసనసభ్యులు, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు జరిపించారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలతో పాటు సంగారెడ్డి పట్టణంలో అనేకమంది భక్తులు, ప్రజలు పాల్గొన్నారు. తూర్పు జయప్రకాశ్ రెడ్డి దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చూస్తూ భజన మండలి భక్తులతో పాల్గొని పూజలు నిర్వహించారు. శ్రీ సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. శ్రీరాముని దర్శించుకుని తెలంగాణ ప్రజలందరికీ సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు ఆయురారోగ్యాలు సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా జై శ్రీరామ్ నినాదాలతో మార్మోగింది. సీతారాముల వారి ఆశీస్సులతో సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని అందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని భగవంతుని ప్రార్థించారు.







# నంది కంది పార్వతీ పరమేశ్వర కళ్యాణోత్సవంలో పాల్గొన్న టిజీఐఐసి చైర్మన్ తూర్పు నిర్మల జయప్రకాష్ రెడ్డి



**28 మార్చి తెలుగు జ్యోతి జాతీయ దినపత్రిక సంగారెడ్డి**

**స్టాఫ్ రిపోర్టర్ సదాశివపేట.**
సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నంది కంది గ్రామంలో పార్వతీ పరమేశ్వర కళ్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీమతి తూర్పు నిర్మల జయప్రకాశ్ రెడ్డి టీ జి ఐ ఐ సి చైర్మన్ వారితోపాటు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి సోదరుడు , ఏ కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆలయ కమిటీ అర్చకులు వేదమంత్రాల సాక్షిగా జరిగిన ఈ కళ్యాణం లో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది ఆలయ కమిటీ సభ్యులు సాధనంగా ఆహ్వానించి వీరిని సన్మానించి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గడిల రామ్ రెడ్డి సీడీసీ చైర్మన్, ఆలయ కమిటీ చైర్మన్ పి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ ఆర్ స్రవంతి భాస్కర్ రెడ్డి, బి చింటూ గౌడ్ మండల కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ వైస్ చైర్మన్ వరప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, పంచాయతీ సభ్యులు, గ్రామ ప్రజలు యువకులు, మహిళలు భారీ ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు.

# ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి పల్లకీ సేవ భక్తులతో కళకళలాడిన సోలిపూర్ చౌడమ్మగుట్ట





**తెలుగు జ్యోతి న్యూస్**
షాద్ నగర్ ప్రతినిధి మార్చ్ 28 మున్సిపాలిటీ పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం భక్తి ఉత్సాహం వెల్లివిరిసింది. భజన భక్త బృందం ఆధ్వర్యంలో స్వామివారి పల్లకీ సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు.పల్లకిలో శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని మోస్తూ "శ్రీరామ జయరామ, జయ జయ రామ" నినాదాలతో భక్తులు ఊరేగింపుగా తీసుకెళ్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భజనలు, భక్తి గీతాలతో ఆలయ పరిసరాలు శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి.ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రాచార్యల ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.భక్తులకు అన్నదానం పంతులు జగన్, శాంతాబాయి దంపతుల సేవా స్ఫూర్తి పట్టణానికి చెందిన పంతులు జగన్, శాంతాబాయి దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించి అందరి ప్రశంసలు పొందారు. ఈ సందర్భంగా వారిని పూలమాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీరామనవమి వేడుకల కోసం పౌల్ట్రీ వ్యాపారవేత్త గుదే వసంతరావు రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే దేవాలయ గార్డెన్‌లోని హనుమాన్ విగ్రహానికి దుర్గా శంకర్, రాజ్యలక్ష్మి దంపతులు స్వంత ఖర్చులతో నూతన రంగులు వేయించి సుందరంగా తీర్చిదిద్దారు. వారికి కూడా ప్రత్యేకంగా సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, జి. వసంతరావు, అన్నారం రఘు గౌడ్, గడ్డమీద రమేష్ ముదిరాజ్, శంకర్ గౌడ్, లక్ష్మారెడ్డి, యాదగిరి, తులసి రామ్, రఘునందన్ రెడ్డి, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, బచ్చన్న, ప్రవీణ్ గౌడ్, పద్మా వెంకటేష్ తదితరులు, భజన భక్త బృందం మహిళలు భారీగా పాల్గొన్నారు.

# రంగాపూర్‌లో మహిళా భవనం భూమి పూజ గ్రామ సర్పంచ్ గోవు అంజమ్మ మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ ప్రారంభించారు

**తెలుగు జ్యోతి న్యూస్**
షాద్ నగర్ ప్రతినిధి మార్చ్ 28 నందిగామ మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో మహిళా భవనం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గోవు అంజమ్మ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు భారీగా ఈ సందర్భంగా సర్పంచ్ గోవు అంజమ్మ మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు. మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా భవనం నిర్మించడం ద్వారా వారి కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు.
మహిళా భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన షాద్ నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళల సాధికారతకు ఇలాంటి సదుపాయాలు కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ కుమార్ గౌడ్, నందిగామ చైర్మన్ రాజుగోపాల్, రవి కుమార్, కావాలి కృష్ణ, డిప్యూటీ సర్పంచ్ బస్వారాజ్, వార్డు సభ్యులు సతీష్, అవినాష్, కావాలి అంజయ్య, కల్వకొలు శేఖర్, రాంచంద్రి, రాఘవేందర్, శ్రీనివాస్, చందు, శ్రీరాంలు, అజయ్, హన్మంతు, నవీన్, గొల్ల జంగయ్య, తోట మహిపాల్, చంద్రయ్యతో పాటు మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





# సదాశివాపేట పట్టణంలో మహమ్మద్ నాయెబ్ ఆధ్వర్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన జ్యూస్ హబ్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు ప్రారంభించారు





ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, పట్టణంలో వ్యాపారాలను ప్రోత్సహించడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. ఇలాంటి వ్యాపారాలు అభివృద్ధి చెందడం ద్వారా పట్టణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.జ్యూస్ హబ్ ప్రారంభోత్సవంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, వ్యాపారవేత్తలు మరియు యువకులు పాల్గొన్నారు..

# సంగారెడ్డి ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆసుపత్రికి 35 లక్షల విలువగల డిజిటల్ ఎక్స్రే యంత్రాన్ని అందజేసిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు



**28 మార్చి తెలుగు దినపత్రిక సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్.**
సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి 35 లక్షల రూపాయల విలువగల డిజిటల్ ఎక్సరే యంత్రాన్ని ఎన్టిపిసి సహకారంతో అందజేసిన మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు , జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపర్డెంట్ మరియు డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.వారితోపాటు సంగారెడ్డి బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ రాజేశ్వరరావు దేశ్పాండే మరియు కే జగన్ మున్సిపల్ కౌన్సిలర్ బిజెపి రాష్ట్ర నాయకులు, ఎం నాగరాజు మరియు డాక్టర్ రాజు గౌడ్, సంగారెడ్డి పట్టణ బిజెపి నాయకులు పాల్గొన్నారు.


# తూర్పు నిర్మల జయప్రకాశ్ రెడ్డి జన్మదిన సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసి పూల బోకే ను అందించిన గొల్లపల్లి మాజీ సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి



**28 మార్చి తెలుగు జ్యోతి జాతీయ దినపత్రిక సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్.**
సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి పట్టణంలో తూర్పు నిర్మల జయప్రకాశ్ రెడ్డి జన్మదినశీ సందర్భంగా జన్మదిన వేడుకల్లో పాల్గొని శ్రీమతి తూర్పు నిర్మల జయప్రకాశ్ రెడ్డి టీజీఐఐసి చైర్మన్ ను కలిసిన గొల్లపల్లి మాజీ సర్పంచ్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి శు భాకాంక్షలు తెలియజేసి పూల బోకేను అందజేశారు. శ్రీకాంత్ రెడ్డి తెలుగు జ్యోతి విలేకరితో మాట్లాడుతూ తూర్పు నిర్మల జయప్రకాశ్ రెడ్డి డిసిసి అధ్యక్షురాలిగా పి జి ఐ ఐ సి చైర్మన్గా పనిచేస్తూ సంగారెడ్డి పట్టణంలో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ సంగారెడ్డి నియోజకవర్గానికి మంత్రుల ద్వారా నిధులు తీసుకువస్తూ అభివృద్ధి చేస్తుందన్నారు. మీకు భగవంతుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు కలగజేసి రాబోవు రోజుల్లో ఉన్నతమైన అవకాశాలు రావాలని కోరుకుంటున్నాను అన్నారు.

## చేగూర్, వెంకమ్మగూడలో వైభవంగా సీతారాముల కళ్యాణోత్సవం ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, చేగురు మాజీ సింగిల్ విండో చైర్మన్ మామిళ్ల విఠల్






**తెలుగు జ్యోతి న్యూస్ షాద్నగర్ ప్రతినిధి మార్చి 28 నందిగామ** మండల పరిధిలోని చేగూర్, వెంకమ్మగూడ గ్రామాల్లో సీతారాముల కళ్యాణోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చేగూర్ గ్రామ మాజీ సర్పంచ్ గుర్రాజరావు, వెంకమ్మగూడ గ్రామ సర్పంచ్ గొల్లపల్లి అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, శ్రీ రామచంద్రుని కృపా కటాక్షాలు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, పాడి పంటలతో ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ చైర్మన్ మామిళ్ల విట్టల్, బుగ్గోనీగూడ మాజీ సర్పంచ్ బండి నీలమ్మ రాజు, సింగిల్ విండో డైరెక్టర్ బండి మల్లేష్, బీఆర్ఎస్ నాయకులు పబ్బే పూజిత ప్రవీణ్ గుండాల శ్రీను, బంటారం మల్లేష్ గౌడ్, లక్ష్మణ్ రావు, ఆర్ శేఖర్, ఎర్రోళ్ల నరసింహ, వెంకమ్మగూడ వార్డు సభ్యులు, యువ నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కొత్తూరులో అర్ధరాత్రి వరకు శోభాయాత్ర చిన్నారుల కూచిపూడి నృత్యం ప్రత్యేక ఆకర్షణ..







**తెలుగు జ్యోతి న్యూస్**
షాద్ నగర్ ప్రతినిధి మార్చ్ 28 కొత్తూరు, మున్సిపల్ కేంద్రంలోని నవమి వేడుకల సందర్భంగా కొత్తూరు పురపాలక కేంద్రంలో జగదభిరాముడి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ప్రారంభమైన శోభాయాత్ర అర్ధరాత్రి వరకు పురవీధుల గుండా వైభవంగా సాగింది. శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వాముల విగ్రహాలను ఊరేగించగా, భక్తులు వాడవాడలా చేరుకుని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో నాట్య శ్రీ కళామండలి ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ప్రారంభం నుంచి ముగింపు వరకు తమ ప్రతిభతో అలరించిన చిన్నారులను స్థానికులు ఘనంగా అభినందించారు. చిన్నారులకు బహుమతులు అందజేసిన దాత సిటీ కేబుల్ వెంకటేష్..చిన్నారుల ప్రతిభను గుర్తిస్తూ స్థానిక దాత సిటీ కేబుల్ వెంకటేష్తో పాటు గ్రామ పెద్దలు సుదర్శన్ గౌడ్, మాసుల లక్ష్మయ్య, అంజయ్య, నాగరాజు చారి, రాజశేఖర్ రెడ్డి, రవి నాయక్, వాటర్ మల్లేష్, ఆంజనేయులు గౌడ్, శ్రీను చారి, జి. రవి, బాలు, మాసుల రామకృష్ణ ముదిరాజ్, అనిల్ తదితరులు చిన్నారులకు బహుమతులు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజు శర్మ, గణేష్ యాదవ్ తదితరులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని పూజలు నిర్వహించిన సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్





**27 మార్చి తెలుగు జ్యోతి దినపత్రిక సంగారెడ్డి స్టాఫ్ రిపోర్టర్.**
సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ పాల్గొని సాంప్రదాయ పద్ధతుల్లో శ్రీ సీతారాములకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో పాల్గొని వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. శ్రీరాముని దర్శించుకుని జిల్లా ప్రజలందరికీ ఆయురారోగ్యాలు సుఖశాంతును కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ వాతావరణం భక్తులు జయ శ్రీరామ్ నినాదాలతో మార్మోగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీరామనవమి పర్వదినం భారతీయ సంస్కృతికి ప్రత్యేకశీ అని ధర్మం, న్యాయం, సత్యానికి, శ్రీరాముడు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజలు శ్రీరాముడి ఆచారాలను అనుసరించి సమాజంలో ఐక్యతను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో , చింతా సాయినాథ్ బి ఆర్ ఎస్ రాష్ట్ర యువనాయకులు ,పట్టణ అధ్యక్షులు చీల మల్లన్న కార్యదర్శి వీరేశం ,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్ ఎర్ర విశాలి, నాగరాజ్ గౌడ్, గిడిగి నగేష్, అక్షయ్ గౌడ్, పాలనేత్ర గౌడ్, ఆలయ కమిటీ అధ్యక్షులు రమేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పెంజర్లలో అనంత పద్మనాభ స్వామి రాజగోపురం నిర్మాణానికి భూమి పూజ చేసిన మాజీ ఎమ్మెల్యే చౌల్లపల్లి ప్రతాపరెడ్డి, మాజీ జడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి





**తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి మార్చ్ 28 కొత్తూరు** మండలంలోని పెంజర్ల స్వయంభు శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయంలో నూతన రాజగోపురం నిర్మాణానికి శుభారంభం జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ బెజవాడ అనిత రెడ్డి ఆధ్వర్యంలో దాతల సహకారంతో సుమారు రూ.75 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుందర్ రెడ్డి, సిడి తాండ సర్పంచ్ గబ్రు చౌహన్, పెంజర్ల గ్రామ సర్పంచ్ జగన్, మాజీ సర్పంచ్ అంబటి ప్రభాకర్, మామిడి విక్రం రెడ్డి, సిద్ధార్థ రెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని తెలిపారు. రాజగోపురం నిర్మాణంతో ఆలయానికి మరింత వైభవం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వనం బాలరాజ్, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ మోహన్ రెడ్డి, టీచర్ కృష్ణారెడ్డి, ఉపసర్పంచ్లు శంతన్ రెడ్డి, రవీందర్ నాయక్, కమిటీ సభ్యులు కుమ్మరి రమేష్, పద్మా రెడ్డి, శంకర్ యాదవ్, దేశాల రమేష్, మాజీ ఉపసర్పంచ్ పాముల రమేష్, నాయకులు దామోదర్ రెడ్డి, దేశాల జైపాల్, దేశాల భీమయ్య, వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ పరిధిలో మెగా క్లీన్ స్వీప్ డ్రైవ్ విజయవంతం..

### వివరాలు వెల్లడించిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన..

**తెలుగుజ్యోతి శేరిలింగంపల్లి, మార్చి28:**
సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్వర్యంలో చేపట్టిన శనివారం మెగా క్లీన్ స్వీప్ డ్రైవ్ విజయవంతముగా నిర్వహించినట్లు కమిషనర్ సృజన తెలిపారు.
శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో డ్రైవ్ కు సంబంధించిన వరాలు వెల్లడించారు. పటాన్చెరు నుండి మణికొండ వరకు ఉన్న ప్రధాన మార్గంలో సుమారు 22 కిలోమీటర్ల మేర సాగిన ఈ డ్రైవ్ను 44 విభాగాలుగా విభజించారు. పటాన్చెర్వు బీహెచ్ఈఎల్ నల్లగండ్ల ఫ్లైఓవర్, గచ్చిబౌలి, మల్కం చెరువు, కాజాగూడ జంక్షన్ (యూ-టర్న్) లాంకో హిల్స్, మణికొండ. గచ్చిబౌలి స్టేడియం వరకు ఈ డ్రైవ్ చేపట్టారు. శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ నాయకత్వంలో శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్లు అన్ని విభాగాల సీనియర్ అధికారుల సమక్షంలో సిఎంసి కమిషనర్ సృజన ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ డ్రైవ్ సుమారు 22 కిలోమీటర్ల మేర, 44 విభాగాలుగా విభజించబడి, కేంద్రీకృత , క్రమబద్ధమైన శుభ్రతను అందించింది. ఇరువైపులా 500 మీటర్ల పొడవున్న ప్రతి విభాగానికి, ప్రత్యేక వాహనాలు యంత్రాలతో పాటు సుమారు 15 మంది పారిశుధ్య కార్మికులను మోహరించారు. మొత్తం మీద, 128 మంది అధికారులు 716 మంది పారిశుధ్య కార్మికులు ఈ డ్రైవ్లో చురుకుగా పాల్గొన్నారు. చెత్త శిధిలాలను సకాలంలో తొలగించడానికి టిప్పర్లు, జేసీబీలు, ట్రాక్టర్ ఆటోలు, డోజర్లు నిచ్చెనలతో సహా మొత్తం 224 వాహనాలు యంత్ర యూనిట్లను సమర్థవంతంగా ఉపయోగించారు. ఈ డ్రైవ్ సందర్భంగా, గణనీయమైన పరిమాణంలో వ్యర్థాలను తొలగించడం జరిగింది:

చెత్త: 129 మెట్రిక్ టన్నులు..
పేరుకుపోయిన పూడిక: 142 మెట్రిక్ టన్నులు
నిర్మాణ కూల్చివేత వ్యర్థాలు: 455 మెట్రిక్ టన్నులు
పచ్చని వ్యర్థాలు: 227 మెట్రిక్ టన్నులు
తొలగించిన మొత్తం వ్యర్థాలు: 953 మెట్రిక్ టన్నులు
లైట్ల మార్పిడి: 65
వదులుగా ఉన్న కేబుళ్లను బిగించడం: 25
ఫుట్పాత్ ఆక్రమణల తొలగింపు: 186




ఫుట్పాత్ మధ్యభాగాలకు మరమ్మతులు చేపట్టడానికి, ఆక్రమణలను తొలగించడానికి, వేలాడుతున్న వైర్లను సరిచేయడానికి (25 స్పాన్ల వదులును బిగించడం), 65 లైట్లను మార్చడానికి, చెట్ల కొమ్మలను కత్తిరించడానికి, మొక్కలు నాటడానికి, రంగులు వేయడానికి మొదలైన పనుల కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేశాయి. ఈ డ్రైవ్లో ప్రజలు చురుకుగా పాల్గొన్నారు. భారీ స్థాయిలో జరిగిన ఈ పారిశుధ్య కార్యక్రమం పట్ల ప్రజా ప్రతినిధులు, పౌరులు సంతోషంతోపాటు ప్రశంసలు వ్యక్తం చేశారు. రోడ్ల పరిస్థితి పరిసరాలలో స్పష్టంగా కనిపించిన మెరుగుదలను ప్రజలు స్వాగతించారు. అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో చేసిన కృషి, సమర్థవంతంగా మోహరించిన యంత్రాంగం ఈ కార్యక్రమాన్ని ఘనవిజయం వైపు నడిపించాయి.

## లిపెంచిన ఎల్పిజి గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలిలి లిప్రజలపై భారం మోపవద్దులి లిపాలమాకుల జంగయ్యలి. లిసిపిఐ జాతీయ సమితి సభ్యులులి

**తెలుగుజ్యోతి శేర్లింగంపల్లి మార్చి 28**
ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎల్పిజి గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంట గ్యాస్ ధరలు అమాంతం పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు జీవన భారం మోయలేని పరిస్థితి ఏర్పడింది. ఇదే విధంగా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల కారణంగా రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరుగుతున్నాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచిన ఎల్పిజి గ్యాస్ ధరలను తగ్గించాలి. ప్రజలకు అందుబాటులో గ్యాస్ సరఫరా నిరంతరం ఉండేలా చర్యలు తీసుకోవాలి. అలాగే పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించి, ప్రజలపై పడుతున్న ఆర్థిక భారం తగ్గించాలి. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కాకుండా సామాన్య ప్రజల పక్షాన నిలబడాలి. ధరల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రజల్లో ఆగ్రహం పెరుగుతుంది.
అందువల్ల ప్రభుత్వం తక్షణమే:
- ఎల్పిజి గ్యాస్ ధరలను తగ్గించాలి
- గ్యాస్ సరఫరాను సక్రమంగా నిర్వహించాలి
- పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలి

లేకపోతే ప్రజా ఉద్యమాలు తీవ్రరూపం దాల్చే అవకాశముందని హెచ్చరిస్తున్నాము.. ఈరోజు సిపిఐ కార్యాలయం శేరిలింగంపల్లి నియోజకవర్గ సమితి. కౌన్సిల్ కార్యవర్గ సమావేశం. కే.వెంకటస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు. టి రామకృష్ణ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు. కే చందు యాదవ్ సిపిఐ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం కార్యదర్శి. కున.సుధాకర్ ఎస్ కొండలయ్య జెట్టి శ్రీనివాస్. ఎం వెంకటేష్. బి నారాయణ. తుపాకుల రాములు. కే శివకుమార్. ధర్మ తేజ నితీష్. అశోక్ కే కాశీ




Printer, publisher and Owned by DUVVALA SHEKAR YADAV, Published from PLOT NO, 427, H NO 6-1-4, PRASHANTH NAGAR, MIYAPUR, HYDERABAD, TELANGANA - 500049.
Printed from NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA, KURNOOL, ANDHRA PRADESH - 518380. Editor: DUVVALA SHEKAR YADAV, PRGI NO TGTEL/25/A2223